ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గణితపితామహుడు శ్రీనివాస రామానుజన్‌కు నివాళి



ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని సత్యవాణి స్కూల్‌లో..



అపురూపా కాలనీలోని టీవీఆర్ స్కూల్‌లో..

కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ గణితపితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను స్మరించుకుని పూలమాలలు వేశారు. విద్యార్థులు గణితశాస్త్రానికి సంబంధించిన నమూనాలను తయారు చేసి పాఠశాలల్లో ప్రదర్శించారు. నమూనాలను తోటి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులతో అలంకరించారు. ఆటలు, పాటలు, నాటకాలతో పాఠశాలలో సందడి చేశారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు, క్విజ్ నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాలల్లో ఉన్న గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. – జీడిమెట్ల

సూరారం సిరిఫ్యూచర్ కిడ్స్‌లో..







నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



వివేకానంద విద్యామందిర్ పాఠశాలలో..

నేడు సూర్య నమస్కారాలు సక్సెస్ మీట్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వసంత యోగా అకాడమీ ఆధ్వర్యంలో సక్సెస్ మీట్‌ను నిర్వహించనున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఉన్న 19 – 56 వయస్సుల వారితో వసంత యోగా అకాడమీ 108 సూర్య నమస్కారాలు నిర్వహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న సక్సెస్ మీట్‌లో సీఐడీ డీజీపీ కార్యాలయ డీప్యూటీ ఎస్పీ రాజ్‌గోపాల్, నెచర్ క్యూర్ ఆస్పత్రి డైరెక్టర్ డా. శ్రీసాయిరామ్, ఉన్నత భారత్ అభియాన్ రిజనల్ కోఆర్డినేటర్ నవీన్‌కుమార్, వీఎన్ఆర్ వీజేఐఈటీ యాజమాన్య సభ్యులు పాల్గొననున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఆయనను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను విన్నవిస్తున్న దృశ్యం

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు

దుండిగల్: తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి మర్యాపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పార్లమెంట్‌లో విపక్ష సభ్యుల అక్రమ సస్పెన్షన్‌కు నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఇందిరపార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, జగ్గారెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లతో కలిసి భూపతిరెడ్డి పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

టీటీడీ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

హిమాయత్‌నగర్: వైకుంఠ ఏకాదశి పర్వదినానికి హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయాన్ని రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఇతర ఏర్పాట్లు చేశారు. 23న వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేకువజామున ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం ఏకాంతంగా నిర్వహిస్తారు. సర్వదర్శనం ఉదయం 3.30 గంటలకు ప్రారంభం అవుతుందని, వీఐపీలు, ప్రొటోకాల్ ప్రముఖులు 3 గంటలకు రిపోర్టు చేయాలని ఆలయ అధికారులు సూచించారు. సాయంత్రం 6 నుంచి 6.45 గంటల వరకు నైవేద్య విరామ సమయం ఉంటుందన్నారు. తిరిగి 6.45 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభం అవుతుందని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పిస్తామన్నారు. భక్తులంతా ఆలయ సిబ్బందికి సహకరించి, ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకొని ఆశీర్వాదం తీసుకోవాలని వారు కోరారు.

పార్లమెంట్ సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ భవనం భద్రతపై మాట్లాడని బీజేపీ ప్రభుత్వం దాడికి గల కారణాలు అడిగిన ఎంపీలను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ విమర్శించారు. దాడికి పాల్పడిన వారికి పాస్‌లు జారీ చేసి, రచ్చకు కారణమైన బీజేపీ ఎంపీని సస్పెండ్ చేయకపోవడం దారుణమన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా సమితి చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ భవనంలోకి చొరబడి కలర్ గ్యాస్‌ను విడుదల చేసిన ఘటన, భద్రత వ్యవస్థ లోపాన్ని ఎత్తి చూపుతుందన్నారు. 143 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడంపై సీపీఐ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఉమామహేష్ తెలిపారు. ప్రజల హక్కుల గురించి ఆలోచించకుండా నియంతగా పాలిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గంటకు పైగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించిన సీపీఐ జిల్లా నాయకులు కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు శంకర్, శంకర్‌రావు, కృష్ణమూర్తి, లక్ష్మి, హరినాథ్‌రావ్, శ్రీనివాస్, రాములు గౌడ్, స్వరూప, ప్రమీల, రాములు, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వరి, పద్మ, లక్ష్మీనారాయణ, సామెల్, చంద్రకాంత్, సత్తిరెడ్డి, ఇమామ్, లక్ష్మణ్, ఇస్తారీ, రవి, యాదగిరి, బాబు పాల్గొన్నారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సుపై విమర్శలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు పలు విమర్శలకు దారి తీసింది. క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో రిసెంట్ అడ్వాన్సెస్ ఇన్ జువాలజీ–ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపార్చునిటీస్ అనే అంశం ఈనెల 20న ప్రారంభమై శుక్రవారం ముగిసింది. అంతర్జాతీయ సదస్సు అంటే విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని, ఒక్కరు కూడా విదేశీయులు హాజరు కాలేదని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సదస్సుకు హాజరైన విద్యార్థులు అధికారులను కోరారు.

మూడు దేశాల నుంచి పరిశోధనా పత్రాలు..

ఓయూ జంతుశాస్త్రం విభాగం 99 ఏళ్ల పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు 350 మంది ప్రతినిధులు హాజరు కాగా యూఎస్ఏ నుంచి 3 పరిశోధన పత్రాలు, ఆస్ట్రేలియా, జర్మనీ నుంచి ఒక్కొకటి వచ్చినట్లు హెడ్ ప్రొ.మాధవి వివరించారు.

నామినేటెడ్ రేసులో ఓయూ విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నూతన ప్రభుత్వంలో పలువురు ఓయూ విద్యార్థులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. శుక్రవారం ఓయూలో చనగాని దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన విద్యార్థి నేతలకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లభించలేదన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం ఉద్యోగాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పోరాడిన తనతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినందున విద్యార్థి నేతలు రేసులో ఉన్నట్లు పేర్కొన్నారు.

మహనీయుల మార్గం స్ఫూర్తిదాయకం

మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ జి.చెన్నయ్య

ఖైరతాబాద్: దళిత హక్కు, ఐక్యత కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మార్గంలో తుది శ్వాస వరకు పోరాడిన మహనీయులు దివంగత గడ్డం వెంకటస్వామి (కాక), పీవీ రావులని మాల ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ జి.చెన్నయ్య కొనియాడారు. శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో పి.వి.రావు 18వ వర్ధంతి, వెంకటస్వామి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ... పి.వి.రావు తన కుటుంబ శ్రేయస్సు కన్నా కులమే ముఖ్యమని వర్గీకరణకు వ్యతిరేకంగా తన ఉద్యోగాన్ని వదులుకొని దళితులను ఏకం చేసిన ధీరుడన్నారు. వెంకటస్వామి(కాక)తన జీవితం మొత్తం బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతికి పాటుపడటమే గాక నిలువ నీడలేని లక్షలాది మంది పేదలకు నీడనిచ్చి గుడిసెల వెంకటస్వామిగా కాక పేరు గాంచారన్నారు. బాబాసాహెబ్ వారసుడిగా, దేశ కార్మిక శాఖ మంత్రిగా ఉండి కార్మికుల ప్రయోజనాల కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత తుది శ్వాస విడిచారని గుర్తుచేశారు. వీరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

నూతన టెక్నాలజీలో మెలకువలు నేర్చుకోవాలి

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఏఐసీటీఈ అమోదిక అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మలేషియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ అస్రల్ బహారి జామ్బెక్, డాక్టర్ శివరామన్ ఈశ్వరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిశోధన రంగంలో అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేసే దిశగా విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనల్లో దేశంలోని వివిద సంస్థలు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాలు పంచుకుని నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ సునీత, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర బాబు, కాన్ఫరెన్స్ సమన్వయకర్తలు డాక్టర్ అరుణారావు, డాక్టర్ సాయికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఎంపీల సస్పెన్షన్ నిరంకుశత్వానికి నిదర్శనం

రంగారెడ్డినగర్: పార్లమెంట్ రక్షణపై ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ ఎంపీలను బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడం ఆ పార్టీ నిరంకుశత్వానికి నిదర్శనమని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు స్వామి అన్నారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజారు నుంచి సాగర్ హోటల్ వరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ లో చోటు చేసుకున్న పొగ బాంబు ఘటనపై సమగ్ర చర్చ జరిపించాలన్నారు. హోమ్ మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తే వారిని సభ నుంచి గెంటి వేయడం దారుణమన్నారు. పార్లమెంట్‌లో సభ్యులకే రక్షణ కొరవడిందన్నారు. ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడుంటుందని ప్రశ్నించారు. పొగబాంబు ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలని, వారికి పాస్‌లు ఇచ్చిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో సీపీఐ నాయకులు శ్రీనివాస్ చంద్రకాంత్ ఎం. నరసింహా రెడ్డి, సీపీఎం మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, బి.సత్యం, రావుల స్వాతి, నాయకులు శీను, కరుణాకర్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు

కలెక్టరేట్‌లో సెమీ-క్రిస్మస్ వేడుకలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సెమీ –క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి రఘునాథస్వామి కేక్ కట్ చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి అంజయ్య, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సింహారాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం, వివిధ కేటగిరిలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఈశ్వర్, శ్రీనివాస్, గిరికాంత్, అనిల్, పద్మ, అన్నపూర్ణ, రామ్‌రెడ్డి, జేమ్స్‌దాస్, శ్రీచాంద్, అక్షయ్, విజయ్, మంజుల, శ్రీవిద్య, నాగలక్ష్మి, నాగరాజు, కమల్, విజయ్, బాలాజీ, సత్యనారాయణ, ప్రకాష్, అమరేశ్వరి, గణేష్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు పట్టేస్తాయ్!



- నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- ఇటీవల ఇద్దరు బైక్ దొంగలను పట్టుకున్న పోలీసులు
- వారి వద్ద నుంచి 17 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- కెమెరాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: నేరస్తులు, దొంగలను గుర్తించే విషయంలో నిఘ నేత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గతంలో పలు కేసులను పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించారు. తాజాగా వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఇద్దరు దొంగలను సైతం నిఘా నేత్రాల ద్వారానే గుర్తించి పట్టుకోవడం విశేషం. వారి వద్ద నుంచి 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

◆ పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే పలు గేటెడ్ కమ్యూనిటీలతో పాటు కాలనీల్లో సీసీ కెమెరాలు ప్రాధాన్యతపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తూ వచ్చారు. సీఐ ప్రశాంత్ నేతత్వంలో ప్రధాన రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అంతే కాకుండా పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి ప్రత్యేకంగా వాటిని మానిటర్ చేసేందుకు సిబ్బందిని నియమించారు. ఇలా రాత్రిపూట జరిగే రోడ్డు ప్రమాదాలతో పాటు, చైన్ స్నాచింగ్, దొంగతనాలు వంటి విషయాలపై దష్టి సారించే క్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో మేలు చేకూర్చి కేసులను త్వరగా పూర్తిచేసేలా దోహదపడ్డాయి.



ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు (ఫైల్)

జాగ్రత్తలు తీసుకుంటే మేలు: డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు

◆ ద్విచక్ర వాహనదారులు తాము కొనుగోలు చేసిన బైక్ తాళం మూడు సంవత్సరాల తర్వాత కొత్త తాళం వేసుకుంటే దొంగతనాలకు ఆస్కారం ఉండదు.

◆ లక్షల రూపాయలు పెట్టి బైకు కొనుగోలు చేస్తున్న వాహనదారులు అట్టి వాహనానికి జీపీఎస్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే బైక్ దొంగతనం జరిగిన ఎక్కడ ఉందో గుర్తించడం సులువుగా ఉంటుంది.

◆ ప్రతి కాలనీ ప్రధాన రోడ్డు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కాలనీలో కొత్త వారు ఎవరైనా ప్రవేశిస్తే వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్క సంక్షేమ సంఘ ప్రతినిధుల సహకారం ఉండాలి.

◆ వాహనం దొంగతనం జరిగినట్లు గుర్తించగానే వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే తాము వెంటనే పట్టుకునే అవకాశం ఉంది. కొన్ని సంఘటనలు మాత్రం ఒకరోజు జరుగుతే రెండు రోజుల తర్వాత తాపీగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.



◆ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేవారు. అమ్మేవారు తమ పేరుపై ఆర్టీవోలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఫోన్ నంబర్‌తో అడ్రస్ పూర్తిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. వాహనం దొంగతనం జరిగినప్పటికీ ఎక్కడైనా చలానా విధిస్తే వెంటనే మీ ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దీంతో ఆ వాహనాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

బయోమెట్రిక్ హాజరు వేళలు మార్చాలని వినతి

ముషీరాబాద్: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం వేళల్లో ఉద్యోగానికి హాజరయ్యేటప్పుడు బయోమెట్రిక్ అటెండెన్స్ వేళల్లో మార్పులు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కమిషనర్‌ను కలిసి కార్మిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తియాదయ్య వినతి పత్రం సమర్పించారు.

మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నాగేశ్వరరావుకు బొకే అందజేసి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మంత్రి తుమ్మలకు అభినందనలు తెలుపుతున్న భూపతిరెడ్డి, హన్మంతరెడ్డి

కరోనా కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ రఘునాథ్‌స్వామి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.టి.రఘునాథ్ స్వామి సూచించారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు సిబ్బందిని అప్రమతం చేసినట్లు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో 10 పడకలు, మేడ్చల్‌లో 10 పడకలతో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలను అందజేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను సత్వరమే అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.విజమేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఆర్ఓ హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పథకాలు.. ధ్రువీకరణ పత్రాలు!

- ముందే గ్రహించి మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద క్యూ కడుతున్న జనం

సుభాష్‌నగర్: ఇటీవల ఆరు పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. మిగతా పథకాల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.2500 ఆర్థిక సహాయం, రూ.500కి వంట గ్యాస్ పథకాలపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాక ముందే మహిళలు అప్రమత్తమయ్యారు.

మహిళలతో కిక్కిరిసిపోతున్నా

ఈ పథకాలకు తప్పనిసరిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమని వారం రోజుల క్రితం నుంచే వాటిని తీసుకోవడానికి మీసేవ, తహసీల్దార్ కార్యాలయం ముందు క్యూ కడుతున్నారు. దీంతో మీసేవ, తహసీల్దార్ కార్యాలయాలు ఉదయం నుంచి మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. ఇక గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఉదయం 9గంటలకు మహిళలు చంటి పిల్లలతో వస్తున్నారు.

రోజుకు 600 పైగా దరఖాస్తులు..

సాదరణ రోజుల్లో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం వందలోపు మాత్రమే దరఖాస్తులు వచ్చేవని అధికారులు పేర్కొంటున్నారు. వారం రోజుల నుంచి 600 పైగా దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలలో సరిపడే రుజువు చేసే పత్రాలు జత చేయకపోవడంతో దరఖాస్తులు పలుమార్లు తిరస్కరణకు గురి అవుతున్నాయని తెలిపారు. దీంతో దరఖాస్తుదారులు నిత్యం పదుల సంఖ్యలను నేరుగా కార్యాలయానికి వస్తున్నారని చెబుతున్నారు. అందులో కూడా రుజువు చేసే పత్రాలు జత చేయకపోవడంతో తలనొప్పిగా మారిందని సిబ్బంది పేర్కొంటున్నారు.

దరఖాస్తుల తిరస్కరణతో ఇబ్బందులు...

కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న చాలామందికి తిరస్కరణకు గురవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. మహిళల కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి ఆధార్‌కార్డుతో పాటు, వారి రక్తసంబంధమైన అన్న తమ్ముడు లేదా వారి అమ్మ నాన్న కుల సర్టిఫికెట్ జతచేయాలని షరతులు విధించడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న తమ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ లేకపోవడం.. ఒకవేళ ఆ పత్రాన్ని జతచేసిన ఇంటి పేరు వేరు ఉందని అబ్జెక్షన్ చేయడం... అదే మండలంలో ఉన్న ఒక డివిజన్ మారిన అడ్రస్ ప్రూఫ్ సరిగా లేదని దరఖాస్తును తిరస్కరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికీ మూడుసార్లు దరఖాస్తు పెట్టుకున్నా తిరస్కరిస్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే పనిలో నిమగ్నమైన సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కట్టిన జనం

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం...

ఇటీవల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు వందల సంఖ్యలో రావడంతో ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వారం రోజుల వ్యవధిలో 2000 దరఖాస్తులను అందించాం. ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా వారి తమ్ముడు, అన్న, అమ్మానాన్నలో ఎవరిదైన కుటుంబ సభ్యులది కుల సర్టిఫికెట్ తప్పనిసరిగా జత చేయాలి. బీసీలకు అలాంటి అవసరము ఏమీ లేదు. లవ్ మ్యారేజ్ చేసుకున్న వారు, దరఖాస్తుదారుదిపై ఏమన్నా అనుమానాలు ఉంటే సిబ్బంది ప్రశ్నించినప్పుడు చూపిస్తే సరిపోతుంది.



– అబ్దుల్ రహమాన్ ఖాన్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్